# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- యువతకు మెరుగైన భవిష్యత్ అందించడం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- పశుసంపద పరిరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.
- కాకినాడలో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమకు ముఖ్యమంత్రి రేపు శంకుస్థాపన చేయనున్నారు.
- విద్యార్థుల నేత్ర సంరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న విధానాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.

========================

యువత మెరుగైన భవిష్యత్ కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సలహాదారులతో క్యాంప్ కార్యాలయంలో ఆయన ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... భవిష్యత్‌లో ఏయే రంగాల్లో అవకాశాలు ఉంటాయో గుర్తించడంతో పాటు... ఆయా రంగాల్లో వారిలో నైపుణ్యాన్ని పెంచడంపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో అతిపెద్ద రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను స్వీకరించిన ముఖ్యమంత్రి.. ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ (AP-FIRST) పేరుతో తిరుపతిలో రీసెర్చ్ కేంద్రం ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఏఐ-సైబర్ సెక్యూర్టీ, క్వాంటం టెక్నాలజీ, హెల్త్ కేర్ తదితర రంగాలు భవిష్యత్‌లో కీలకం కానున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్న ముఖ్యమంత్రి.. వివిధ రంగాల్లో కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని వివరించారు.

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ కాకినాడలో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమకు రేపు శంకుస్థాపన చేయనున్నారు. ఈ గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత గ్రీన్ అమోనియా పరిశ్రమ ఏర్పాటుతో దేశంలోనే అతిపెద్ద పర్యావరణహిత పరిశ్రమలలో ఒకటిగా నిలిచి చారిత్రాత్మక అడుగు వేయనుంది. ఏడాదికి ఒక మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు కోసం గ్రీన్‌కో గ్రూప్‌కు చెందిన ఏఎమ్ గ్రీన్ సంస్థకు ప్రభుత్వం గత సంవత్సరం అనుమతులు ఇచ్చింది. ఈ గ్రీన్ హైడ్రోజన్‌ను ఉపయోగించి పూర్తిగా పునరుత్పాదక శక్తితో తయారయ్యే కార్బన్ ఉద్గారాలు లేని గ్రీన్ అమోనియాను ఈ సంస్థ ఉత్పత్తి చేయనుంది. 495 ఎకరాల్లో 13 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో ఏఎమ్ గ్రీన్ సంస్థ ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా సుమారు 2 వేల 600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి.

=======================

పశుసంపద పరిరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కనుమ పండుగ సందర్భంగా ఆయన శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం నిమ్మాడలో కుటుంబ సమేతంగా గోసేవలో పాల్గొని గోవులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వ్యవసాయంలో రైతులకు చేదోడుగా ఉంటున్న పశు సంపద దైవంతో సమానమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పశువులకు మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని, పశుగ్రాస క్షేత్రాలకు రాయితీలు తిరిగి ప్రారంభించామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాతలతో పాటు పశుపోషకులు, కోళ్ల రైతుల కష్టాలను గుర్తించి మినీ గోకులాలను పునరుద్ధరించామని మంత్రి చెప్పారు.

=======================

పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, కంటి అద్దాల పంపిణీలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ గత రెండు సంవత్సరాలుగా అమలు చేస్తున్న విధానాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను అభినందించారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని మంత్రి అధికారులకు పిలుపునిచ్చారని ఆ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. 2024–25, 2025–26 విద్యా సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపుతున్న చొరవ ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం తాజా నివేదికలో ప్రశంసించింది. రాష్ట్రంలో అమలవుతున్న ఉత్తమ విధానాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేసేందుకు త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేస్తామని కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి కేటాయించిన కంటి అద్దాల పంపిణీ వార్షిక లక్ష్యాన్ని 90 వేల నుంచి 2.50 లక్షలకు కేంద్ర ప్రభుత్వం పెంచడం విశేషం.

విరామం

=======================

భూమి, నీరు, గాలిని పరిరక్షించుకుని వ్యవసాయాన్ని సుస్థిరం చేసుకోవడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఇటీవల ఒక సందర్భంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొనడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామంలో పలువురు రైతులు ఆకాశవాణితో మాట్లాడుతూ... రైతుల పండుగ అయిన సంక్రాంతి నాడు ప్రధానమంత్రి రైతులు, వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై మాట్లాడడం సంతోషం కలిగించిందన్నారు. సహజ వ్యవసాయం ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడుకునే పంటల సాగును ప్రోత్సహించడం అభినందనీయమని దువ్వ గ్రామానికి చెందిన రైతు సత్యన్నారాయణ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 23వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

========================

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జగ్గన్నతోట ప్రభల ఉత్సవం వైభవంగా జరుగుతోంది. 476 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం రూరల్ మండలాలకు చెందిన 11 ప్రభలను జగ్గన్నతోటకు తీసుకురావడం పరిపాటి. జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించడంతో ఈ సంవత్సరం ఉత్సవాలు మరింత వైభవంగా జరుగుతున్నాయి. కనుమ పండుగ రోజు వివిధ ప్రాంతాల నుండి ఊరేగింపుగా వచ్చిన ప్రభలను కొలువుదీర్చి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ప్రభలను ఆయా ప్రాంతాలకు తరలిస్తారు. కోనసీమ ప్రభల ఉత్సవానికి సంబంధించిన మరిన్ని వివరాలను మా ప్రతినిధి మూర్తి అందిస్తారు.

(వాయిస్ 45 సెకన్లు)

========================

ఈశాన్య రుతుపవనాలు రానున్న రెండు రోజుల్లో నిష్క్రమించేందుకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కేరళ, మహే, కోస్తాంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమ, దక్షిణ కర్ణాటక పరిసర ప్రాంతాలలో ఇందుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు.

========================
========================